
ముగిసిన ఏపీ టెట్

ఎచ్చెర్ల/ నరసన్నపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షలు(టెట్) ఈ నెల 3న ప్రారంభమై సోమవారంతో ముగిశాయి. జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. అన్ని రోజుల్లో కలిపి శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల)లో మొత్తం 3,201మందికి 2,865 మంది అభ్యర్థులు హాజరుకాగా, 336మంది గైర్హాజరయ్యారు. శ్రీ శివానీఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం)లో 1,020మందికి 918 మంది హాజరయ్యారు. 102మంది గైర్హాజరయ్యారు. నరసన్నపేట కోర్ టెక్నాలజీ కేంద్రంలో 10,095 మంది అభ్యర్థులకుగానూ 8,994 మంది హాజరైనట్లు ఎంఈవో, కేంద్ర పర్యవేక్షకుడు పి.దాలినాయుడు తెలిపారు.

తహసీల్దార్ చెబితే ఆపాలా?



మహల్పాడులో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి వేసిన రియల్ ఎస్టేట్ లే అవుట్

కంచిలి/ సోంపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి)

నాలుగేళ్ల క్రితం గిరిజనులకు ఇచ్చిన భూములు అవి. సాగుకు అనుకూలంగా లేకపోవడంతో.. ఉపాధి కరువై వారంతా వలస వెళ్లారు. దీంతో గ్రామం ఖాళీ అయింది. అంతే కొంతమంది భూ బకాసురుల కన్ను ఈ భూములపై పడింది. 20 ఎకరాల్లో చదునుచేసి రియల్ ఎస్టేట్ వెంచర్లు వేశారు. పైగా రూ.లక్ష స్థలం కొంటే స్కూటీ ఫ్రీ అంటూ ప్రకటనలిచ్చారు. అనుమతులు కూడా లేవు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లడంతో అక్కడ బోర్డులు పాతారు. అప్పటి తహసీల్దార్ సైతం ఈ భూములను రిజిస్ట్రేషన్ చేయొద్దని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. అయినా ఓ అధికారి ఇవేమీ పట్టించుకోలేదు. ఏకంగా రిజిస్ట్రేషన్లు చేసిపెట్టారు. రూ.కోట్ల విలువైన ఈ భూబాగోతంపై ఆంధ్రజ్యోతి కథనం..

- **వివాదాస్పద మహల్పాడు భూముల రిజిస్ట్రేషన్**
- **ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ప్రమేయంపై ఆరోపణలు**
- **ప్రభుత్వ, డీ-పట్టా భూములు సైతం విక్రయం**

సోంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం.. అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారుతోంది. ఇప్పటికే పలు రిజిస్ట్రేషన్లపై కొంతమంది మండిపడుతున్నారు. కార్యాలయంలో డబ్బులిస్తే చాలు.. అక్రమ రిజిస్ట్రేషన్లు సాగిపోతాయని ఆరోపిస్తున్నారు. సర్వే నెంబర్లు అడంగళ్‌లో లేనప్పటికీ రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన సోంపేట మండలం బెంకిలిలో కొన్నాళ్ల కిందట చోటుచేసుకుంది. ఈ విషయంపై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి. దీంతో సదరు వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రిజిస్ట్రేషన్ రద్దయింది. తాజాగా.. సాక్షాత్తు తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాలు బేఖాతర్ చేస్తూ.. కంచిలి మండలంలోని వివాదాస్పద మహల్పాడు భూముల రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ లేఅవుట్‌లో వేసిన ఈ స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయొద్దని తహసీల్దార్ ఆదేశించినా.. పట్టించుకోకపోవడం చర్చనీయాంశమవుతోంది.

- కంచిలి మండలం భోగాబెణి పంచాయతీ మహల్పాడు గ్రామంలో నివసిస్తున్న గిరిజనులకు గత వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్ల కిందట డీ-పట్టా భూములను మంజూరు చేసింది. అయితే స్థానికంగా వ్యవసాయానికి అనుకూలత లేకపోవడం, ఉపాధి దొరక్క గ్రామంలోని వారంతా సుదూర ప్రాంతాలకు వలస వెళ్లారు. దీంతో గ్రామం ఖాళీ అయింది. పూరి గుడిసెలు, గ్రామకంఠ భూమి, స్మశానం ఇతర ప్రభుత్వ స్థలాలు మాత్రం మిగిలాయి. పరిసర గ్రామాలకు చెందిన కొంతమంది భూ బకాసురుల కళ్లు ఈ భూములపై పడ్డాయి. గ్రామ సమీపంలో కొంత జిరాయితీ భూమి కొనుగోలు చేసి, పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమించారు. వారు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి.. రైతుల పేరిట సుమారు 20ఎకరాల్లో భూమి చదును చేసి రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి విక్రయించారు. ఈ భూముల విక్రయాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూమిని సైతం కబ్జా చేసి.. 996 ఇళ్ల స్థలాలకు వెంచర్లు వేసిన రియల్ దందాపై పలువురు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతానికి ఈ వెంచర్‌లో 200 పైగా స్థలాలను పలువురు కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ భూమిని విక్రయించి.. ప్రజలకు నష్టం (మిగతా 6వ పేజీలో...)



అనుమతులు లేని వెంచర్‌ను పరిశీలిస్తున్న అప్పటి ఆర్డీవో భరత్‌నాయక్

సబ్‌రిజిస్ట్రార్ తీరుపై అనుమానాలు

మహల్పాడు భూములకు సంబంధించి ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయొద్దని.. సోంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సైతం అప్పటి తహసీల్దార్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా.. ప్రస్తుతం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న వ్యక్తి.. ఇటువంటి వివాదస్పద భూముల రిజిస్ట్రేషన్లపైనే ఎక్కువగా దృష్టిసారిస్తూ.. చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సోంపేట మండలం బెంకిలిలో కొన్నాళ్ల కిందట మరో సబ్‌రిజిస్ట్రార్.. సర్వే నెంబర్లు అడంగళ్‌లో లేనప్పటికీ రిజిస్ట్రేషన్ చేసేశారు. ఈ విషయంపై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సదరు వ్యక్తి పోలీసులను ఆశ్రయించారు. దీంతో రిజిస్ట్రేషన్ రద్దయింది. తాజాగా.. కంచిలి మండలంలోని వివాదస్పద మహల్పాడు భూముల రిజిస్ట్రేషన్ల వ్యవహారంపైనా అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రార్‌లకు ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక విచక్షణాధికారం ఎనీవేర్(ఎక్కడైనా) అనే ఆప్షన్‌ను తమకు అనుకూలంగా మలచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. వివాదస్పద భూముల రిజిస్ట్రేషన్‌పై సంబంధిత అధికారికి వివరణ కోరగా.. 'తహసీల్దార్ చెప్పారు.. ఇతర అధికారులు చెప్పారని రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయం. కేవలం కోర్టులు ఆదేశిస్తేనే ఆపుతా'మంటూ చెప్పడం కొసమెరుపు. ఇటువంటి చర్యలపై ఉన్నతాధికారులు విచారణ చేసి, ప్రభుత్వ భూములను సంరక్షించడమే కాకుండా ప్రజలు మోసపోకుండా చూడాలని సర్వత్రా కోరుతున్నారు.



పోర్టు పనులు పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

జూన్ 12న మూలపేటలో

తొలి షిప్ ల్యాండింగ్

- 8వేల ఎకరాల్లో పారిశ్రామికాభివృద్ధి
- భావనపాడులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం
- పోర్టు పనులు పునఃప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టులో వచ్చే ఏడాది జూన్ 12న తొలి షిప్ ల్యాండ్ అయ్యేలా లక్ష్యం నిర్ణయించామని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం మూలపేట పోర్టు పనులను పునఃప్రాంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 2014లో 3,500 ఎకరాల్లో భావనపాడుకు పోర్టు నిర్మాణానికి నోటిఫికేషన్ ఇచ్చాం. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పోర్టును మూలపేటకు మార్చి కేవలం 350 ఎకరాల్లో నిర్మాణం చేపట్టారు. పోర్టుకు అనుసంధానం భూములుంటే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. ఈ మేరకు ఈస్టుకోస్టు పవర్‌ప్లాంట్‌కు చెందిన 1800 ఎకరాలు, ఏపీఐఐసీకి చెందిన 1200 ఎకరాలతోపాటు ఈ ప్రాంతంలో ఉన్న 5వేల ఎకరాల సాల్ట్ భూములను తీసుకొని అభివృద్ధి చేపడతాం. ఉప్పు భూములు తీసుకొనేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదించింది. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఆయిల్ రిఫనరీ మంజూరు చేసింది. నేను, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఈ ప్రాంతంలో రిఫనరీ పెట్టాలని (మిగతా 6వ పేజీలో...)

వణికిస్తున్న వాయుగుండం

- రైతుల గుండెల్లో తుఫాన్ గుబులు
- వరి పంటకు ముంపు నష్టం తప్పదని ఆందోళన



జమ్ము వద్ద కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట

నరసన్నపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రైతులను బెంబేలెత్తిస్తోంది. ఈనెల 23 నుంచి జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. సోమవారం సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత దశలో వరి పంటకు ముంపు నష్టం వాపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 4,75,947 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ఆర్ఎన్ఆర్, పారిజాతి రకాల పంట కోత దశలో ఉంది. పాతపట్నం, సారవకోట, జలుమూరు, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జలి తదితర మండలల్లో ఇప్పటికే కొంతమేరకు యంత్రాలతో కోతలు పూర్తి చేసి పచ్చిధాన్యాన్ని విక్రయాలు చేపట్టారు. నరసన్నపేట, పోలాకి, కోటబొమ్మాళి, గార, శ్రీకాకుళం, ఆమదాలవలస, బూర్జ, (మిగతా 6వ పేజీలో...)



విద్యుత్ శాఖ హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

అరసవల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దానా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఈ నెల 22 నుంచి 28వరకు ఈదురుగాలులు, వర్షాలతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో మూడు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పంపిణీలో అవాంతరాలు ఏర్పడితే.. శ్రీకాకుళం- 94906 10045, టెక్కలి- 83328 43546, పలాస-73825 85603 ఫోన్లు నెంబర్లుకు సంప్రదించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు ఒరిగినా.. వైర్లు తెగినా సహాయ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలన్నారు. వినియోగదారులు భద్రతా సూచనలు పాటించాలని తెలిపారు.

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

- నవంబరు 21 నుంచి 27 వరకు ప్రక్రియ
- ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు
- నోటిఫికేషన్‌ను జారీచేసిన చేసిన కలెక్టర్

శ్రీకాకుళం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు. త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. గత ప్రభుత్వం ఆయకట్టు సంఘాలను నిర్వీర్యం చేసేసింది. సాగునీటి రంగం ప్రాధాన్యం లేని విషయంగా భావించింది. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం ఆయకట్టు సంఘాల ఎన్నికలపై చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఎన్నికలకు గాను నోటిఫికేషన్ జారీ చేసింది.

- **జిల్లాలో 344 సాగునీటి సంఘాలు...**

జిల్లావ్యాప్తంగా 344 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటికిగాను అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నారు. భారీ, (మిగతా 6వ పేజీలో...)

బెడిసికొట్టిన రాజీ చర్చలు

- అత్యాచార బాలిక పరిస్థితిపై తల్లి ఫిర్యాదు
- బాధితులకు న్యాయం చేయాలన్న ఎమ్మెల్యే శిరీష

8లో



విద్యార్థినుల అదృశ్యంపై ఆరా తీస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

రాత్రివేళ.. గోడ దూకి..

- కేజీబీవీలో ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం
- ఆలస్యంగా తెలుసుకున్న సిబ్బంది
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

జి.సిగడాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారు. అంతవరకు వసతిగృహంలో ఉన్న ఆ ఇద్దరు ఆదివారం రాత్రి సుమారు 2.44 గంటల సమయంలో కళాశాల గోడదూకి అదృశ్యమైనట్లు సీసీ ఫుటేజీల్లో నమోదైంది. ఈ విషయాన్ని కళాశాల సిబ్బంది ఆలస్యంగా గుర్తించడం.. ఆపై అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంలో జాప్యం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..

జి.సిగడాం మండలం ఆనందపురానికి చెందిన రెడ్డి భార్గవి, రాజాం మండలం వస్త్రపురి కాలనీకి చెందిన తలారి లిఖిత.. కేజీబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. వీరిద్దరూ ఆదివారం రాత్రి కళాశాల వసతిగృహం గోడదూకి.. బయటకు వెళ్లిపోయారు. కానీ తిరిగిరాలేదు. కళాశాల సిబ్బంది సోమవారం ఉదయం 7 గంటల వరకూ ఆ ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైనట్లు గుర్తించలేదు. సీసీ ఫుటేజీలు పరిశీలించగా.. ఆదివారం రాత్రి 2.44గంటల సమయంలో వారు కళాశాల గోడ దూకి బయటకు వెళ్లినట్లు (మిగతా 6వ పేజీలో...)

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

6లో



అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ..


ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోండి

7లో

- 'మీ కోసం'లో విద్యార్థి తండ్రి ఫిర్యాదు
- ప్లకార్డులతో కుటుంబ సభ్యుల నిరసన



ప్లకార్డులతో విద్యార్థి తండ్రి, కుటుంబ సభ్యుల నిరసన



జ్యూయలరీ షాపులో ఆభరణాలు



ధర.. బంగారమే!

- 10 గ్రాములు రూ.80 వేలు
- 2020లో 10 గ్రాములు రూ.40వేలు
- సామాన్యులకు అందని స్థాయిలో పసిడి పరుగులు

నరసన్నపేట ప్రత్యేకం..

జిల్లాలో 650కి పైగా బంగారం దుకాణాలు ఉన్నాయి. నరసన్నపేట మార్కెట్ పసిడి వ్యాపారానికి పెట్టింది పేరు. నిత్యం ఇక్కడ రూ.కోట్లలో వ్యాపారం సాగుతుంది. నరసన్నపేట, శ్రీకాకుళంలలో చిన్నా పెద్దా కలిపి 400కు పైగా బంగారం దుకాణాలు ఉన్నాయి. నరసన్నపేట పట్టణంలో మూడు హోల్‌సేల్ దుకాణాలు ఉండగా... 230 వరకు చిన్న,పెద్ద షాపులు ఉన్నాయి. ఇక కాశీబుగ్గ, టెక్కలి, సోంపేట, ఆమదాలవలస, బ్రాహ్మణతర్లలో మరో 300 వరకు షాపులు ఉన్నాయి. జిల్లాలో నిత్యం రూ.2 కోట్లకు పైగా వ్యాపారం సాగేది. ధరలు పెరుగుతుండటంలో వ్యాపారాలు సాగడం లేదని... ఇటీవల పెళ్లి ముహూర్తాలు ఉండటంతో ఎంతో కొంత వ్యాపారాలకు కదలిక వచ్చిందని వ్యాపారులు అంటున్నారు.

పసిడి ధరలు ఇలా..

సంవత్సరం	పది గ్రాములు
1910	రూ.15.50
1920	రూ.18.25
1930	రూ.18.05
1940	రూ.36
1950	రూ.99
1960	రూ.111.56
1970	రూ.184.50
1980	రూ.1330
1990	రూ.3,200
2000	రూ.4,400
2010	రూ.18,500
2020	రూ.40,000
2024	రూ.80,000

నరసన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. రోజురోజుకూ ఈ ధరలు ఆకాశం వైపు దూసుకుపోతున్నాయి. 24 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ.80 వేలు మార్కు దాటి ఆల్‌టైం రికార్డు సృష్టించింది. గత నాలుగేళ్లలో బంగారం ధరలు 100శాతం పెరిగాయి. 2020లో పది గ్రాముల బంగారం రూ.40వేలు ఉండగా... ప్రస్తుతం రెట్టింపైంది. గత రెండు నెలల్లో బంగారం ధర పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది శ్రావణ మాసపు మొదటిలో పది గ్రాముల ధర రూ.69 వేలు ఉండగా... రెండు నెలల్లో గ్రాముకు రూ.వెయ్యికి పైగా పెరిగింది. బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. పసిడి పరుగులు పెడుతుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రానున్న పెళ్లిళ్ల సీజన్‌కు బంగారం కొనుగోలు చేయడం చాలా కష్టమని తలలు పట్టుకుంటున్నారు.

వెండిదీ అదే దారి..

ఇక బంగారం బాటలోనే వెండి కూడా ప్రయాణిస్తోంది. కిలో వెండి ధర రూ.95వేలకు చేరింది. ఏడాది క్రితం కిలో వెండి రూ.60వేలు ఉండగా.. ప్రస్తుతం దాదాపు 55 శాతం మేరకు ధరలు పెరిగాయి. ఈ ధరలకు భయపడి సామాన్య, మధ్య తరగతి ప్రజలు వెండి వైపు చూడడానికి కూడా సాహసించలేకపోతున్నారు.

వన్‌గ్రామ్ గోల్డ్‌కు పెరుగుతున్న ఆదరణ..

బంగారం ధరలు పెరగడంతో మధ్య తరగతి వర్గం వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలపై మొగ్గు చూపుతున్నారు. మరోవైపు దొంగల భయం పెరగడం కూడా వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలకు గిరాకీ పెంచుతోంది. రూ.పది వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడి పెడితే ఏడాది నుంచి మూడేళ్ల వరకు వన్‌గ్రామ్ గోల్డ్‌కు మన్నిక వస్తోందని మహిళలు చెబుతున్నారు.

రూ.లక్షకు చేరే అవకాశం..



బంగారంపై మదుపరులు పెట్టుబడులు పెట్టడంతో భవిష్యత్‌లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. బంగారం మీద పెట్టుబడి పెట్టేవారు స్థానికంగా పెరిగారు. అందువల్ల గిరాకీ పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరగడం కూడా ఒక కారణం. వచ్చే ఏడాది మాఘమాసం నాటికి 10 గ్రాములు ధర రూ.లక్షకు చేరే అవకాశం ఉంది.

-ఉణ్న రంగనాథ్, నరసన్నపేట బంగారం వర్తక సంఘ మాజీ అధ్యక్షులు

కొత్తగా కొనడం కష్టంగా ఉంది..



ముందు చూపుతో కొంచెం.. కొంచెం కొనుగోలు చేసుకున్న వారికి బంగారం ధరలు పెరగడం బాగుంది. కొత్తగా కొనాలంటే బాగా ధరలు పెరిగాయి. నా పెళ్లి నాటికి 10 గ్రాముల బంగారం రూ.4,500 ఉండేది. రూ.80వేలకు చేరుతుందని ఎప్పుడూ ఊహించలేదు. మధ్య తరగతి కుటుంబాలకు బంగారంపై పెట్టుబడి కలసి వస్తుంది.

-కె.లీలావతి, ఉపాధ్యాయులు, అంపోలు ఉన్నత పాఠశాల





అమర వీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- గంజాయి, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
- మహిళలపై దాడులు, అపహరణలను నియంత్రించాలి
- సైబర్ నేరాలను అరికట్టడాన్ని సవాల్‌గా తీసుకోవాలి
- రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అనునిత్యం శాంతిభద్రతలను కాపాడుతున్న పోలీసులు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు... కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావులతో కలిసి పోలీసు అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై గర్వపడుతున్నాని చెప్పారు. నక్సలిజాన్ని అదుపు చేసి... శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసుల పాత్ర ప్రశంసనీయమన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టడాన్ని పోలీసులు సవాల్‌గా తీసుకుని పని చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా విచ్చలవిడిగా జరిగిందని ఆరోపించారు. దీనిని అరికట్టేందుకు రాష్ట్రంలో నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి 500 మందితో ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. మహిళలపై అఘాయిత్యాలు, అపహరణలు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయని... వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసులకు మంత్రి సూచించారు. సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ... టెక్నాలజీ సాయంతో నేరస్తులను పట్టుకోవాలని కోరారు. పోలీసు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్ అందించే బాధ్యత తీసుకున్నామన్నారు. విధులలో చనిపోయిన పోలీసు కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. హోంగార్డులను అన్ని విధాలుగా ఆదుకుంటామని... మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా అందిస్తామని మంత్రి చెప్పారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, ఉత్సవాలు, కొవిడ్ కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు మరువలేనివని చెప్పారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది కారుణ్య నియామకాల ద్వారా ఐదుగురికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు మంత్రి అచ్చెన్నాయుడు సత్కరించారు. 2024లో విధి నిర్వహణలో మరణించిన ఉమామహేశ్వరరావు, సతీష్, మాధవరావు, లక్ష్మణరావుల కుటుంబ సభ్యులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలను మంత్రి అందించారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలను ఆయన పరిశీలించారు. దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన 216 మంది పేర్లతో జిల్లా పోలీసు శాఖ రూపొందించిన పుస్తకాన్ని ఎస్పీకి మంత్రి అందజేశారు. వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, రాజశేఖర్, శేషాద్రి, ప్రసాద్, అమరవీరుల కుటుంబ సభ్యులు, సిఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ చెబితే ఆపాలా?

(ఐదో పేజీ తరువాయి) కలిగిస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థపై విచారణ చేసి.. చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రూ.లక్ష స్థలం కొంటే.. స్కూటీ ఫ్రీ

అత్త సొమ్ము.. అల్లుడు దానం చేసిన చందంగా.. ప్రభుత్వ భూమిని అప్పనంగా ఆక్రమించి.. రూ.లక్ష స్థలం కొంటే.. రూ.70 వేల స్కూటీని ఫ్రీగా ఇస్తామంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ప్రకటనలు గుప్పించారు. 15 అడుగుల వెడల్పు, 40 అడుగుల పొడువు గల స్థలాన్ని తక్కువ ధరకే సొంతం చేసుకోవచ్చని.. దళారీల సాయంతో స్కీమ్‌ల పేరిట ఆశలు కల్పించారు. దీంతో చాలామంది ఈ స్థలాలను కొనుగోలు చేశారు. అలాగే మరికొంతమందికి ఈఎంఐల పేరిట ప్రతినెలా కొంత నగదు తీసుకుని.. వాయిదాలు పూర్తయిన తర్వాత రిజిస్ట్రేషన్ కాగిస్తాలు అందిస్తామని చెబుతున్నారు. కాగా.. ఇటువంటి స్కీములకు ఎటువంటి చట్టబద్ధత కానీ, రక్షణ గానీ ఉండవని తెలియక చాలామంది మోసపోతున్నారు. అసలే ఎటువంటి అనుమతులు లేవు. భూమి వారిది కాదు. ఈ నేపథ్యంలో వాయిదాల సొమ్ము అంతా చెల్లించిన తరువాత సంస్థ ఉంటుందో, లేదో తెలియదు. దళారీలు సైతం ఎంతవరకు బాధ్యత తీసుకుంటారో నన్నది సందేహమే.

ఆ స్థలాలు కొనొద్దు..

అనుమతులు లేకుండా మహల్పాడులో వేసిన వెంచర్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయవద్దంటూ కంచిలి తహసీల్దార్ వై.జయలక్ష్మి పరిసర గ్రామాల్లో దండోరా సైతం వేయించారు. సంబంధిత స్థలాల వద్ద సర్వే నెంబర్లు చూపిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో పలాస ఆర్డీవో సైతం కొన్నాళ్ల కిందట ఇక్కడకు వచ్చి పరిశీలించారు. అయితే వివాదస్పద భూముల్లో వెంచర్‌ను పరిశీలించి చర్యలు తీసుకున్న కంచిలి రెవెన్యూ అధికారి ఇటీవల బదిలీపై వెళ్లారు. కొత్త తహసీల్దార్ రావడంతో మళ్లీ వెంచర్ నిర్వాహకులు తమ క్రయవిక్రయాలు మొదలు పెట్టారు. గతంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుకు రంగులు వేసి.. వాటిపై ఉన్న సర్వే నెంబర్లు తొలగించారు.

ఇటీవల రిజిస్ట్రేషన్ చేసిన భూములివే..

మహల్పాడు వద్ద ఉన్న జిరాయితీ భూములను సెంట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేయాలని తహసీల్దార్ సూచించారు. కానీ అలా చేయకుండా ఇళ్ల స్థలాలుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఎల్‌పీ నెంబర్లు యథాతథంగా ఉంచి, వేరే సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేస్తూ కొనుగోలుదారులను మోసగిస్తున్నారు. మహల్పాడులో వెంచర్‌కు సంబంధించి సర్వే నెంబరు 469/12బి. ఎల్‌పీ నెంబరు 182లో తే8.10.2024దీన డాక్యుమెంట్ నెంబరు 5996 నుంచి 9 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం.తప్పుడు సర్వే నెంబర్లతో ఎల్‌పీ నంబర్లు ఉపయోగిస్తూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

బోగాబెణి పంచాయతీ మహల్పాడులో వెలసిన లే అవుట్ విషయంలో ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. లే అవుట్‌ను పరిశీలించి.. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం. గతంలో ఈ లే అవుట్‌లో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు తొలగించిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాం.

-ఎన్.రమేష్‌కుమార్, తహసీల్దార్, కంచిలి

జూన్ 12న మూలపేటలో తొలి షిప్ ల్యాండింగ్

(ఐదో పేజీ తరువాయి) సీఎం చంద్రబాబుకు కోరాం. ఒకవేళ రిఫనరీ రాకుంటే కాలుష్యరహిత పరిశ్రమలు స్థాపించేలా చర్యలు తీసుకుంటాం. పోర్టుకు అనుగుణంగా టౌన్‌షిప్ రావాలి. విశాఖ-భోగాపురం వరకు తీరప్రాంత వెంబడి ఆరు లేన్ల రహదారిని మొదటి విడతలో చేపడతాం. రెండో విడతలో భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకు ఆరు లేన్ల రహదారి నిర్మిస్తాం. మూలపేట పోర్టుకు అనుసంధానంగా 8వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసి పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర నూతన పారిశ్రామిక పాలసీ ద్వారా ఎంఎస్‌ఎంఈ కింద ప్రతి నియోజకవర్గంలో ఒక పార్కు ఏర్పాటు చేస్తున్నాం. వలసలు నివారణకు చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

భావనపాడులో ఫిషింగ్ హార్బర్

మూలపేటలో పోర్టుతోపాటు మత్స్యకారుల వేట కోసం భావనపాడులో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 'బుడగట్లపాలెంలో త్వరలోనే పిషింగ్ హార్బర్ పనులు చేపడతాం. మంచినీళ్లపేటలో ఫిష్ ల్యాండింగ్ ట్యాంక్ నిర్మిస్తాం. మత్స్యకారులను అన్ని విధాల ఆదుకుంటాం. రాష్ట్రంలో సొంత అవసరాలకు పూర్తిగా ఉచితంగా ఇసుక తీసుకువెళ్లేందుకు అనుమతులు ఇచ్చాం. ప్రజలకు అనువుగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్ల సీనరీజ్‌ను రద్దు చేసింది. గత ప్రభుత్వం మద్యం పేరిట రూ.వేల కోట్లు దోచుకుంది' అని అచ్చెన్న ఆరోపించారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తాం..

పోర్టు నిర్వాసితులందరికీ న్యాయం చేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. 'గత ప్రభుత్వంలో చాలామంది నిర్వాసితులకు అన్యాయం జరిగింది. దీనిపై ఇప్పటికే రీసర్వే చేసి బాధితులను గుర్తించాం. పోర్టు వల్ల నిర్వాసితులుగా మారిన మూలపేట,విష్ణుచక్రం గ్రామాల వారికి ముందుగా ఉపాధి కల్పిస్తాం. తర్వాత నియోజకవర్గ స్థాయి వారికి న్యాయం చేస్తాం. నిర్వాసితుల కాలనీని టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తాం. అక్కడ ఉప్పునీరు పడడం వల్ల వంశధార రిజర్వాయర్ ద్వారా పైప్‌లైన్ వేసి మంచినీటిని అందిస్తామ'ని అచ్చెన్న తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఆర్డీవో కృష్ణమూర్తి, కింజరాపు హరప్రసాద్, మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న పాల్గొన్నారు.

30 శాతం పనులు పూర్తి..

విశ్వసముద్ర ఇంజనీరింగ్ లిమిటెడ్ ఎమ్‌డీ అనిల్ ఎండ్లూరి మాట్లాడుతూ 30శాతం పోర్టు పనులు పూర్తయ్యాయని తెలిపారు. '580 మీటర్ల పొడవు నార్త్‌బ్రేక్ వాటర్ పనులు పూర్తయ్యాయి. సౌత్ బ్రేక్ వాటర్ పనులు 2450 మీటర్లకుగాను 1700 మీటర్లు పూర్తి చేశాం. ఇండో పార్ట్ కాంక్రీట్ బ్లాక్‌లను 54వేలకు 24 వేల బ్లాక్‌లు పూర్తయ్యాయి. జనరల్ కార్గో బెర్త్‌కు పైలింగ్ పూర్తయింది. ఒక కోల్ బెర్త్ ప్రారంభించాల్సి ఉంది. 14 కిలోమీటర్ల మేర మూలపేట నుంచి జాతీయ రహదారి -16 వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కోసం సబ్‌గ్రేడ్ పూర్తయింది. వచ్చే ఏడాది జూన్ 12 నాటికి మెదటి బెర్త్ వినియోగంలోకి తీసుకువస్తామ'ని ఎమ్‌డీ తెలిపారు.

వణికిస్తున్న వాయుగుండం

(ఐదో పేజీ తరువాయి) టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో వరి పంట కోసేందుకు సిద్ధంగా ఉంది. ఈ దశలో ఏమాత్రం గాలులు వీచినా, వర్షం పడినా నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటా అక్టోబరులో తుఫాన్‌ల బెడద తప్పడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురిస్తే పండిన పంటంతా మొలకెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చివరి వరకు గండమే..

తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటే పండిన వరిపైరు నేలపై పడిపోతుంది. పంట చేతికి వచ్చేవరకు గండంగా ఉంటుంది. తురుచూ ప్రకృతి వైపరీత్యాల నుంచి బయట పడేలా ముందుస్తుగానే కాలువల్లో సాగునీరు విడుదల చేస్తే రైతుకు బాగుంటుంది.

-జల్లు చంద్రమౌళి, ల్యాండ్ లార్డు, ఉర్లాం

అక్టోబర్ అంటే భయమే..

ఏటా అక్టోబరు నెల వచ్చిందంటే రైతులకు భయమే. దీపావళి అమావాస్య పోయే వరకూ వరికోతలు కోచేందుకు చూస్తాం. గత నెలలో తుఫాన్ గండం తప్పిందని సంతోషించాం. పంటలు మరో పదిహేనురోజుల్లో చేతికి వస్తున్న తరుణంలో మళ్లీ తుఫాన్ హెచ్చరికలతో భయమేస్తోంది. ప్రస్తుతం వరి పంట కోయలేం. పొలంలో ఉంచలేని పరిస్థితి నెలకొంది.

-యాళ్ల వేణుగోపాలరావు, రైతు, మాకివలస

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

(ఐదో పేజీ తరువాయి) మధ్యతరహా, చిన్ననీటి పారుదల సంఘాల పరిధిలో ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు ప్రారంభించారు. గతంలో నిర్ధారించిన ఆయకట్టు కింద ఉన్న సర్వే నంబర్ల ఆధారంగా ఓటర్ల జాబితా ఆధునీకీకరించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అలాగే ఆయకట్టు పరధిలో వాస్తవ సాగుదారుడెవరన్న వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. రైతుల ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, ఇతర అన్ని అభ్యంతరాలను పరిశీలించాక తుది జాబితాను నవంబరు 13న ప్రచురిస్తారు. నవంబరు 21 నుంచి 27 వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. సోమవారం నుంచి నలభై రోజులపాటు ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుంది. సాగునీటి సంఘాల పరిధిలోని పంట కాలువల అభివృద్ధి, నీటి సరఫరా తీరుతెన్నులు పర్యవేక్షించడంతోపాటు ఆయకట్టు పరిధిలో ఏ సమస్య వాటిల్లినా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంది. టీడీపీ హయాంలో 2015లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరగ్గా.. మళ్లీ ప్రస్తుత కూటమి పాలనలో వీటిని నిర్వహించడం గమనార్హం.

రాత్రివేళ.. గోడ దూకి..

(ఐదో పేజీ తరువాయి) గుర్తించారు. కొద్దిసేపటి తర్వాత వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అయితే రెడ్డి భార్గవి తల్లిదండ్రులు వలసజీవులు కావడంతో గుంటూరులో ఉంటున్నారు. అలాగే తలారి లిఖిత తల్లిదండ్రులు విషయం తెలిసి ఆందోళన చెందారు. లిఖిత తండ్రి వెంకటరమణ.. స్నేహితులకు, బంధువులకు సమాచారం అందించి.. కుమార్తె ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. కాగా.. సోమవారం మధ్యాహ్నం అవుతున్నా ఆ ఇద్దరు విద్యార్థినులు తిరిగి రాకపోవడంతో కళాశాల సిబ్బంది.. జీసీడీవో సింహాద్రి నీరజకు కూడా సమాచారం అందజేయడంతో ఆమె కళాశాలను సందర్శించారు. విద్యార్థినుల అదృశ్యంపై కళాశాల ప్రత్యేకాధికారితో పాటు సిబ్బందిని ప్రశ్నించారు. కానీ సమాచారం గోప్యంగా ఉంచడం పలు విమర్శలకు దారితీసింది. అలాగే పోలీసులకు కూడా ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ వై.మధుసూదనరావు, సిబ్బందితో పాటు కళాశాలకు చేరుకొని పరిసరాలను పరిశీలించారు. కళాశాల ప్రత్యేకాధికారిని ప్రమీల, సిబ్బందితో మాట్లాడారు. ప్రత్యేకాధికారిని ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, విద్యార్థినుల ఆచూకీపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఆదివారం రాత్రి విద్యార్థినులు అదృశ్యం కాగా.. ఉదయం 7 గంటల వరకు ఆ విషయం సిబ్బందికి తెలియకపోవడం.. తెలిసినా మధ్యాహ్నం వరకూ గోప్యంగా ఉంచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు అదృశ్యమైన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే ప్రయోజనం ఉండేదని పలువురు పేర్కొంటున్నారు.



నరసన్నపేటలో తాటిరాజుల విన్యాసాలు (ఫైల్)

ఏవీ ఆ పౌరుషాలు?

- కళ తప్పుతున్న నందన్న సంబరాలు
- కనుమరుగవుతున్న తాటిరాజులు

నరసన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పల్లెల్లో నందన్న ఉత్సవాలు వచ్చాయంటే సరి.. ఆ సందడి వేరు. ముందుగా నందన్న ఊరేగింపులు... వెనుక వైపు ఎడ్ల బండ్లపై తాటిరాజుల విన్యాసాలు అలరించేవి. రాజులు తమ బలాలను ప్రదర్శించేందుకు డోలు... కత్తి పట్టి యుద్ధం చేసే విధంగా ఒకరికొకరు ఢీ కొనేవారు. వీరిలో బాగా ప్రదర్శనలు చేసే వారికి నోట్ల దండలను మెడలో వేసేవారు. తరం మారింది.. నేడు డీజేలు... రికార్డింగ్ డ్యాన్సులతో పురాతన పల్లె సంస్కృతి కనుమరుగైంది.

గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



కవిటిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ తెలిపారు. సోమవారం కవిటి పంచాయతీలోని పలు గ్రామాల్లో సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త దాసరి రాజు, నాయకులు బి.రమేష్, పి.కృష్ణారావు, ఎస్వీ రమణ, మణిచంద్ర ప్రకాష్, ఎల్.శ్రీను, ఎ.మధు, బి.చిన్నబాబు, వి.రంగారావు, పి.బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల తయారీకి కొచ్చెర్ల ఉపాధ్యాయుడు ఎంపిక



రాజేశ్వరరావు

రణస్థలం, కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి : మండలంలోని కొచ్చెర్ల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బి. రాజేశ్వరరావు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఈపీ అమలులో భాగంగా మంగళవారం నుంచి ఈనెల 24 వరకూ ఆర్ఐఈ మైసూరులో జరగనున్న ఎన్‌సీఈఆర్‌టీ నూతన పాఠ్య పుస్తకాల తయారీకి ఎంపికయ్యారు. ఆయన ఇదివరలో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల తయారీ, యునెస్కో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు, ప్రాథమికవిద్య బోధన విధానాలపై సదస్సులో గతంలో పాల్గొన్నారు. రాజేశ్వరరావు ఎంపికకావడంపై డీఈవో సదాశివుని తిరుమల చైతన్య, ఉపవిద్యాశాఖాధికారి ఆర్.విజయ్‌కుమారి, ఎంఈవో త్రినాథ రావు, బి.లావణ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

పనులకు తీర్మానం తీసుకోవాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి పంచాయతీ తీర్మానం తప్పనిసరిగా తీసుకోవాలని సర్పంచ్‌లు కోరారు. సోమవారం ఎంపీడీవో రామారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. సర్పంచ్‌ల హక్కులను భంగం కలిగించే పనులుచేస్తే న్యాయపరమైన పోరాటం చేయాల్సివస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నర్తు ప్రసాద్, పాతిర్ల రాజశేఖరరెడ్డి, శారద, ధనలక్ష్మి, గుజ్జు ఢిల్లీరావు, కారంగి త్రినాథ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

సోంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు అన్ని విధాలా మేలు చేస్తాయని మాస్టర్ ట్రైనర్ సంజయ్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యంచేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు.

ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి

కంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణకు అధికారులు, మిల్లు యజమానులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ కోరారు. సోమవారం కంచిలిలో ఏవో ధనుంజయ, మిల్లు యజమానులు, పీఏసీఎస్, డిసిఎంఎస్, మర్లపోలమ్మ ఎఫ్‌పీవో సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో మిల్లర్ల సంఘం అధ్యక్షుడు మల్లా ధనుంజయరావు, గన్ని వైకుంఠరావు, మోహన్, కె.సంతోష్, సీఎస్‌డీటీ కూర్మారావు, రామారావు, ప్రియాంక పాల్గొన్నారు.

ప్రార్థన మందిరం నిర్మాణాన్ని అడ్డుకోండి

పొందూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి : అనుమతిలేకుండా నిర్మిస్తున్న ప్రార్థన మందిరం పనులను అడ్డుకోవాలని జి.సిగడాం మండలంలోని చీడిపేట గ్రామస్థులు కోరారు. ఈ మేరకు కృష్ణాపురం ఆనందాశ్రమంలో ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద దృష్టికి సోమవారం తీసుకువచ్చారు. ఈవిషయంపై జి.సిగడాం తహసీల్దార్‌తో మాట్లాడానని ఆయన తెలిపారు.

వీఆర్‌ఏల సంఘ జిల్లా అధ్యక్షుడిగా వెంకట అప్పారావు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జి.వెంకటఅప్పారావు ఎన్నికయ్యారు. సోమవారం శ్రీకాకుళంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి బీవీవీఎస్ రాజు, వీఆర్‌ఏల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గరికిపాటి బ్రహ్మయ్య, నాయకులు రాఘవేంద్ర, సతీష్‌కుమార్, అప్పలస్వామి పర్యవేక్షణలో వీఆర్‌ఏల జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.గోపి,సహాధ్యక్షుడిగా బాలకృష్ణ, ఉపాధ్య క్షులుగా జి.రమణ, జి.నాయుడు, ట్రెజరర్‌గా ఎస్.త్రినాథరావు, సహాయ కార్యదర్శిగా పి.ప్రసాదరావు, సీహెచ్‌అప్పన్నతో పాటు కార్య వర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నవోదయలో ప్రవేశం కోసం దరఖాస్తులు

సరుబుజ్జిలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వెన్నెలవల నవోదయవిద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.పరశు రామయ్యతెలిపారు. దరఖాస్తులు నవోదయ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో చేయాలని సూచించారు.

చదువుకోసం.. సాహసం చేయాల్సిందే

- బస్సులు లేక నిత్యం విద్యార్థులకు అగచాట్లు
- ఇదీ సరుబుజ్జిలి మండలం విద్యార్థుల పరిస్థితి



బస్సులో వేలాడి ప్రయాణిస్తున్న విద్యార్థులు

సరుబుజ్జిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ విద్యార్థులకు అగచాట్లు తప్పడంలేదు. సరిపడినన్ని ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో వేలాడి విద్యాసంస్థలకు చేరుకోవల్సివస్తోంది. సరుబుజ్జిలిలో ఇంటర్, డిగ్రీ వంటి ఉన్నత విద్యాసంస్థలు లేకపోవడంతో మండలంలోని విద్యార్థులు శ్రీకాకుళం, ఆమదాలవలస, పాలకొండ తదితర పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అయితే ఈ రూట్‌లో ఉదయం విద్యాసంస్థలకు విద్యార్థులు వెళ్లే సమయంలో అరకొర బస్సులు నడుస్తున్నాయి. ఎలాగైనా సకాలంలో కళాశాలకు చేరుకోవాలన్న ఆతృతతో సాహసం చేయాల్సివస్తోంది. నిత్యం వేలాడి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇటీవల ఈ రహదారిలో ఉన్న స్టూడెంట్స్ స్పెషల్ బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. దీంతో ఉన్న అరకొర పల్లె వెలుగు బస్సులను ఆశ్రయించి చేరుకోవల్సివస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి హిరమండలం-శ్రీకాకుళం రహదారిలో విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అర్జీలను పరిష్కరించండి: జేసీ



శ్రీకాకుళం కలెక్టరేట్: అర్జీలను స్వీకరిస్తున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసంలో అందిన అర్జీలను నిర్దిత గడువులోగా పరిష్కరించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో మీకోసం కార్యక్రమంలో డీఆర్వో ఎం.అప్పారావు, జడ్పీసీఈవో శ్రీధరరాజు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్‌తో కలిసి 138 అర్జీలను స్వీకరించారు.కార్యక్రమంలో డీపీవో కె.భారతీ సౌజన్య, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఉద్యానశాఖ అధికారి ప్రసాదరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధాకరరావు, డీసీహెచ్ఎస్ కళ్యాణబాబు పాల్గొన్నారు.

వైద్యమిత్రలకు సమాన వేతనం ఇవ్వాలి

డాక్టర్‌ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో 17ఏళ్లుగా పనిచేస్తున్న వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, జిల్లా మోనటరింగ్ యూనిట్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మీసాల త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి పప్పల.అప్పారావు కోరారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సోమవారం జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జేసీకి వినతిపత్రం సమర్పించారు.స్పష్టమైన హామీ లభించకుంటే ఈనెల 29వ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విధులను బహిష్కరించి, పూర్తిస్థాయి సమ్మెలో పాల్గొంటామని ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్టుఅండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనిన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి యశోద, జ్యోత్స్న, సంధ్య, భాస్కర్, వెంకటేష్, శ్రీనివాస్, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పదవీ విరమణ బెనిఫిట్స్ అందించండి

తనకు పదవీ విరమణ అనంతరం అందాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని నందిగాం మండలం పెద్దినాయుడుపేటలో అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త సన్యాసమ్మ పాణిగ్రాహి కోరింది. గతఏడాది మే నెలలో పదవీ విరమణ చేసినా అనంతరం తనకు రావాల్సిన మొత్తం అందలేదని వాపోతోంది. ఈ మేరకు జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన మీకోసంలో వినతిపత్రం అందజేసింది.

సమస్యలను పరిష్కరించాలి

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చట్ట ప్రకారం చర్యలు తీసుకుని సమ్యలు పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం)లో 40 వినతులు వచ్చాయి.ఈ సందర్భంగా ఫిర్యాదులు స్వీకరించి అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్: పైడిభీమవరం జడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న తన కుమారుడిని కొట్టి కన్ను పోవడానికి కారణమైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఓ తండ్రి సోమవారం శ్రీకాకుళం జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జేసీకి వినతిపత్రం అందజేశాడు. అనంతరం ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి న్యాయంచేయాలని ప్లకార్డులతో నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రణస్థలం పోలీసుస్టేషన్‌లో ఈనెల ఏడోతేదీన ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోకపోగా డీఈవో, ఇతర అధికారులు కలెక్టర్‌కు ఆ ఉపాధ్యాయుని రక్షించేందుకు తప్పుడుసమాచారం అందజేశారని వాపోయాడు. ఈ విషయంపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన హెచ్‌ఎంను బదిలీచేసి క్రిమినల్, శాఖాపరమైన విచారణ జరిపించాలని తమకు న్యాయం చేయాలని కోరాడు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



ఇచ్ఛాపురం: విద్యార్థులకు పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు



కంచిలి: సాలినపుట్టుగలో ఆర్ఎస్ఐ రమణమూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఐ మంగరాజు

కంచిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని సోంపేట సీఐ బి.మంగరాజు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని సాలినపుట్టుగకు చెందిన ఆర్ఎస్ఐ రమణమూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2008లో బలిమలలో జరిగిన సంఘటనలో రమణమూర్తి అమరుడైనట్లు తెలిపారు. అనంతరం రమణమూర్తి తండ్రిని కంచిలి ఎస్ఐ జి.రాజేష్‌తో కలసి దుస్సాలువతో సన్మానించారు.

- ఇచ్ఛాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసుల సంస్మరణ దినం పురస్కరించుకుని అమరవీరుల చిత్రపటాలకు ఎస్ఐ శ్రీనివాసరావు, స్వర్ణభారతి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీసుల సేవలు విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

- శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అమరుడైన ఎస్ఐ ఎస్.బంగారునాయుడు తల్లిని విజయనగరం జిల్లా డెంకాడలో మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ త్రినేత్రి సత్కరించారు.ఈ సందర్భంగా బంగారునాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెద్దమ్మతల్లికి చల్లదనోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళంలో జూన్‌లో పెద్దమ్మతల్లి సిరిమానోత్సవాలు పురస్కరించుకుని సోమవారం చల్లదనోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లి, నూకాలమ్మ తల్లి సిరిమనుచెట్లకు భక్తులు పూజలు చేశారు. దెశెల్లవీధి నుంచి భక్తులు ముర్రాటలతో నక్క, గొడారి,దండి, చాకలి, మావూరు, హరిజన వీధులు, బాదుర్లపేట, కొత్తపేట, కునుకుపేటల నుంచి ముర్రాటలతో ఊరేగించారు. ఖాజీపేట వద్ద రెండు చింతచెట్లకు, కొత్తపేట వద్ద గల వేపచెట్టుకు ముర్రాటలతో శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూజల్లో సిరిమానోత్సవకమిటీ అధ్యక్షుడు డీపీ దేవ్, కమిటీ సభ్యులు మావూరు శేఖర్, శంకరరావు, సోంబాబు, గుత్తి చిన్నారావు, గుంటుముక్కల పాపారావు పాల్గొన్నారు.



ముర్రాటలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

300 రోజులకు చేరిన బెంతుఒరియాల దీక్షలు

కవిటి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని బెంతుఒరియాలు కవిటిలో చేపట్టిన దీక్షలు సోమవారానికి 300 రోజుకు చేరాయి. కుల ధ్రువీకరణ పత్రాలు అందించి గుర్తింపు కల్పిం చాలని వారు కోరుతున్న విషయం విదితమే. తమ సమస్యను పరిష్కరిం చాలని గత ఏడాది డిసెంబరు28న రిలేదీక్షను ప్రారంభించారు. సోమవారం వరక గ్రామస్థులు దీక్షలో కూర్చొన్నారు.

గజలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం, అక్టోబరు 21 :(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రత్తకన్న నాయుడు వీధిలో కొలువుదీరిన గజలక్ష్మి అమ్మవారి ఆలయ పదో వార్షికోత్సవం పురస్కరించుకుని మహిళలు 2001 దీపాలతో త్రిశూలంపై దీపారాధన చేశారు. ముగ్గులతో వేసిన శివుని త్రిశూలంపై దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ప్రేంకుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

నీటి సంఘాల ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి

జి.సిగడాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ కోరారు. సోమవారం జి.సిగడాంలో వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనుండడంతో చెరువుల ఆయకట్టు దిగువన ఉన్న రైతులతో కూడిన ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. నీటి తీరువా వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. మంగళవారం నుంచి జరిగే రీసర్వేపై గ్రామ సభలకు రైతులు సహకరించాలని కోరారు. సమావేశంలో డీటీ రాధిక, రీసర్వే డీటీ గాయత్రి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు బీఆర్ ఏయూ జట్టు

ఎచ్చెర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ జట్టు ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరగనున్న సౌత్ జోన్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొనుంది.క్రీడాకారులు సోమవారం వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజనిని కలిశారు. వర్సిటీ స్పోర్ట్స్ డీన్ యు.కావ్యజ్యోత్స్న, పీడీలు ఎం.శ్రీనివాసరావు, ఎ.భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటే శిక్షణ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో హాస్టల్ విద్యార్థినులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి కరాటే శిక్షణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం తరగతులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కరాటే శిక్షకురాలు ఆర్.ఝాన్సీ, పీడీలు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.భాస్కర్ పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

కవిటి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమెళియాపుట్టుగ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.రాధాకృష్ణ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఉమామహపాత్రో తెలిపారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అండర్-14 బాలుర విభాగంలో సత్తాచాటినట్లు పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం రాధాకృష్ణను సిబ్బంది అభినందించారు.

అనాథ బాలలకు సాయం

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో అనాథలైన బాలలు చింతపల్లి మూర్తి, చింతపల్లి గీతలకు మంజూరుచేసిన మొత్తాన్ని పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు, జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ, హెడ్ పోస్టుమాస్టర్ పి.రంగారావు, బాలలరక్షణాధికారి ఐ.లక్ష్మీనాయుడు సోమవారంఅందజేశారు. కొవిడ్ సమయంలో అనాథలైన పిల్లలను ఆదుకోవడానికి 2021లో పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ పథకం ప్రవేశపెట్టారు. ఈ మేరకు జిల్లాలో తొమ్మిది మంది కొవిడ్ అనాథ బాలలకు ఒక్కొక్కరికి రూ.10లక్షలచొప్పున మంజూరు చేశారు. శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీసులో కలెక్టర్ గార్డియన్‌గా జాయింట్ అకౌంట్ ద్వారా డిపాజిట్ చేశారు. పిల్లలకు 18 ఏళ్ల సంవత్సరాలు నిండిన తర్వాత సింగిల్ అక్కౌంట్‌గా మార్చి ప్రతి నెలా స్టయిఫండ్‌గా రూ.5550లు ఖాతాలో జమ చేస్తారు. ఇందులో చింతపల్లి మూర్తి రూ.1.68లక్షలు, చింతపల్లి గీత రూ.1.32లక్షలు విత్‌డ్రా చేసుకున్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి

పొందూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని పొందూరు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న కోరారు. సోమవారం రాపాక సమీపంలోని ఎంజేపీ పాఠశాల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఆమె వెంట న్యాయవాదులు ఎం. రాము, కె. అశోక్, టి. సంతోష్ ఉన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

గార/ఇచ్ఛాపురం/కంచిలి/రణస్థలం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు గార, కంచిలి, రణస్థలం తహసీల్దార్లు ఎస్.రమణారావు, ఎన్.రమేష్‌కుమార్, ఎన్.ప్రసాద్ తెలిపారు. భూముల రీసర్వేలో సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూఅధికారులను కలిసి సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మండలంలోగ్రామాల్లో పూర్తయిన భూ రీసర్వే నివేదిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు రామయ్యపుట్టుగలో సోమవారం అందజేసినట్లు తహసీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూసమస్యలపై గ్రామ సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

సరుబుజ్జిలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో మంగళవారం నుంచి ఈనెల 25 వరకు ఆధార్‌స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.పావని సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. మంగళవారం చిన కాగితాపల్లి, 23న మతలబుపేట, 24న రొట్టవలస, 25న చిగురువలస సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

25న శ్రీకాకుళంలో జాబ్‌మేళా

అరసవల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడలైజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోల్గేట్ పామోలివ్,అపోలోటైర్స్‌లో ఉద్యోగాలకోసం నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఫెయిల్ లేదా పాస్, ఐటీఐ విద్యార్హతగలవారు హాజరుకావచ్చని పేర్కొన్నారు.వివరాలకు 7095731303, 8317652552 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేశవరావుపేట పంచాయతీ లక్ష్ముడుపేట తోటల్లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని సోమవారం రాత్రి అరెస్టుచేసినట్లు ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు. వీరి వద్ద నుంచి 52 వేల రూపాయలు, మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రెండు వలలు దగ్ధం

డి.మత్స్యలేశం తీరంలో రెండు వలలు సోమవారం దగ్ధమయ్యాయి. సముద్రం ఒడ్డున ఉంచిన వలలపై సిగరెట్టు పీకపడి దగ్ధమై ఉండొచ్చని బాధితులు గురుమూర్తి, కొర్ల అయ్యలు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

క్రైం కార్నర్

పుస్తెలతాడు దొంగ అరెస్టు

మెళియాపుట్టి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంతలక్ష్మీపురం పంచాయతీ టకోయి గ్రామానికి చెందిన పల్లి కనకమ్మ అనే వృద్ధురాలి మెడ నుంచి మూడు తులాల పుస్తెలతాడు చోరీ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు పాతపట్నం సీఐ రామారావు తెలిపారు. ఈనెల 18న అదే గ్రామానికి చెంది న శంకుల లోకేశ్వరావు అలియాస్ ప్రసాద్ ఈ చోరీ చేసినట్లు గుర్తించి గొప్పిలి సమీపంలో పట్టుకుని విచారించగా సదరు వ్యక్తి తానే చోరీ చేశానని అంగీకరించాడన్నారు. అతడి నుంచి పుస్తెలతాడును రికవరీ చేశామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి నరసన్నపేట కోర్టులో హాజరుపరిచామన్నారు. త్వరితగతిన నిందితుడి ని పట్టుకున్నందున ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారన్నారు. ఆయనతో పాటు పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు లావణ్య, రమేష్‌బాబు తదితరులున్నారు.

గంజాయి అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిపై కేసు

పాతపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన ముగ్గురు వ్యక్తులు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. ఆదివారం రాయగడకు చెందిన జబ్బాస్, జోసెఫ్, బర్నాశ్ రాయగడ నుంచి ఆంధ్రాలోని రాజమండ్రికి గంజాయిని తరలిస్తు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పోలీసులు వాహనాన్ని నిలుపుదల చేశారు. వారిని చూసి జోసెఫ్, బర్నాశ్ పరారయ్యారు. పట్టుబడిన నిందితుడు జబ్బాస్ నుంచి మిగిలిన వారి వివరాలు సేకరించి వారిని కూడా సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ఆరు కేజీల గంజాయిను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలి మృతి

పొందూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపాక గ్రామానికి చెందిన తోట అమ్మన్నమ్మ (72) చికిత్సపొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది. ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొన్నేళ్లుగా అమ్మన్నమ్మ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో బాధ తట్టుకోలేక మూడు రోజుల కిందట పురుగులమందు తాగింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం


పల్లిసారథిలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు జోరుగా సాగుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు తెలిపారు. మండలంలో రూ.3.5 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. పల్లిసారథిలో రూ.31.31 లక్షలతో మూడు రోడ్లను నిర్మిస్తున్నట్లు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తామాడ విశ్వనాథం తెలిపారు. ఈ పనులను నెలరోజుల్లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. పనులను సచివాలయం ఇంజనీరింగ్ అధికారి ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ దున్న యాయాతి పరిశీలించారు.

రావివలస రోడ్డుకు రూ.63 లక్షలు మంజూరు

టెక్కలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రమైన రావివలస ఎండమల్లి కార్జునస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నౌపడా-మెళియాపుట్టి రోడ్డు నుంచి డీపీఎన్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి రూ.63 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో ఆర్ అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ కె.నయాముల్లా సోమవారం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్తీక సోమవారాలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఈ నిధులతో కార్తీక మొదటి సోమవారం నాటికే రోడ్డు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలివ్వనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు 'ఆంధ్రజ్యోతి' కి తెలిపారు. తానిచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుచేయించానన్నారు. ఐదేళ్లు నిర్లక్ష్యంగా వదిలేసిన రావివలస రోడ్డుకు వెంటవెంటనే నిధులు మంజూరుకు చర్యలు తీసుకున్నామన్నారు. రావివలస రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుపై మాజీ జడ్పీటీసీలు ఎల్ఎల్ నాయుడు, లమ్మత లక్ష్మి, మాజీ సర్పంచ్ బడే జగదీష్, మాజీ ఎంపీటీసీ నర్తు కృష్ణారావు, యాదవ సంఘ కన్వీనర్ ఇప్పిలి జగదీష్, వాసు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.


మంజూరైన పింఛన్ల వివరాలు తెలియజేయండి

పలాసరూరల్/మందస/వజ్రపుకొత్తూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తగా మంజూరైన పింఛన్లు, ఇటీవల కాలంలో తొలగించిన పింఛన్ల వివరాలను తెలియజేయాలని మాజీ మంత్రి గౌతు శివాజీ కోరారు. ఈ మేరకు సోమవారం పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలను కలిసి వినతిపత్రాలను అందించారు. గత ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 2024 జూన్ వరకు పింఛన్ల వివరాలు, గత ప్రభుత్వంలో వివిధ కారణాలతో తొలగించిన వాటి వివరాలను ఇవ్వాలన్నారు. అలాగే ఇళ్లకు సంబంధించిన వివరాలను అందజేయాలని కోరారు. ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి, ఎన్ని కేటాయించారని ప్రశ్నించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు ఉన్నారు.

అదనపు ఫీజులు రద్దు చేయాలి

టెక్కలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అదనపు ఫీజులను రద్దు చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ఎదుట సోమవారం నిరసన తెలిపారు. పెంచిన ఫీజులను తగ్గించాలని, వసతిదీవెన, విద్యాదీవెన పథకాలను అమలు చేయాలని, కోర్సు ఫీజులపై రాయితీ ఇవ్వాలని నినాదాలు చేశారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ మాట్లాడుతూ.. కమిషనర్ ఆదేశాల మేరకే ఫీజులు వసూలు చేస్తున్నామని, విద్యార్థులు అభిప్రాయపడుతున్నట్లు అదనపు ఫీజులు వసూలు చేయడం లేదన్నారు. కోర్సు ఫీజులతో పాటు కళాశాల ఫీజులను కూడా చెల్లించాల్సిన పరిస్థితి ఉందన్నారు.

జీడి పరిశ్రమల సమస్యలను పరిష్కరించండి


ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావును అభినందిస్తున్న సంఘ ప్రతినిధులు

పలాస,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పరిధిలోని జీడి పరిశ్రమల సమస్యలను పరిష్కరించాలని పారిశ్రామికవాడ, ఏపీసీఎంఏ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం జీడి పరిశ్రమదారులు ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీడి పరిశ్రమల యజమానులు ఎదుర్కొంటున్న సమ స్యలు, ఇతర అంశాలను వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీసీఎంఏ సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వర రావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మల్లా కాంతారావు, సుధాకర్, శేఖర్, అచ్యుతరావు, హేమంత్, సత్యనారాయణ, కాళి పాల్గొన్నారు.

రైల్వే గేట్‌ను ఢీకొన్న మినీ వ్యాన్



పలాస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్‌సి గేటుకు విజయనగరం నుంచి పలాస నిత్యావసర సరకులతో వస్తున్న మినీ వ్యాన్ సోమవారం సాయంత్రం ఢీకొంది. దీంతో గేటు పూర్తిగా విరిగిపోయింది. వాహనాలు గంటపాటు రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయాయి. ప్రమాదవశాత్తు ఈ ఘటన జరగడంతో రైల్వే అధికారులు తక్షణం స్పందించి గేటుకు మరమ్మ తులు చేపట్టారు. ఈ మేరకు ఆర్పీఎఫ్ అధికారులు కేసు నమోదు చేసుకొని ప్రమాదానికి కారణమైన వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

వీటిని రోడ్లంటారా?

పాతపట్నం/నరసన్నపేట/హరిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో రోడ్లన్నీ దారుణంగా తయారయ్యాయి. గడచిన ఐదేళ్లలో ఎటువంటి నిర్వ హణ లేకపోవడం, ఇటీవల కాలంలో తరచూ కురు స్తున్న భారీ వర్షాలకు రోడ్లు గోతులమయంగా తయారై ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం నడిచివెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. పలు గ్రామీణ రహదారులపై పెద్ద పెద్ద గోతులై వాహనాలు సైతం వాటిలో కూరుకుపోవడం, మరమ్మతులకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదు. దీంతో ఇటు వాహన దారులు, అటు ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పాతపట్నం, నరసన్నపేట, మందస మండలాల్లోని పలు రోడ్ల దుస్థితి.. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


హరిపురం: ఆక్రమణలకు గురై దారుణంగా ఉన్న ఎస్‌బొడ్లూరు-గుడ్డిమీద బాహాడపల్లి రోడ్డు


పాతపట్నం-టెక్కలి రోడ్‌లో సీతారాంపల్లి గ్రామ సమీపంలో..


నరసన్నపేట బసివాడ వద్ద గోతులతో ఉన్న బాలసీమ రోడ్డు


నరసన్నపేట స్టేట్‌బ్యాంకు వద్ద రోడ్డు కుంగి..

బెడిసికొట్టిన రాజీ చర్చలు

- బాలిక పరిస్థితిపై తల్లి ఫిర్యాదు
- బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలన్న ఎమ్మెల్యే శిరీష


సీఐ మోహనరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాలికలపై అత్యాచారం ఘటనలో కొందరు పెద్దలు తలదూర్చి చేసిన రాజీ యత్నాలు బెడిసికొట్టాయి. రూ.20 లక్షలు బాధిత కుటుంబాలకు ఇవ్వాలని తొలుత భావించి చివరకు రూ.10 లక్షలు ఇచ్చేందుకు బేరం కుదుర్చు కున్నారు. అయితే ఈ వ్యవహారం చిలిచి చిలికి గాలివానగా మారడం, బాలికలపై మైనర్ బాలు రు చేసిన అకృత్యాల వీడియోలు బయటకు రావడంతో ఈ వీడియోలను అంతర్జాలం నుంచి తొలగించి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుల్లో ఒక బాలిక ఇంకా అపస్మారక స్థితిలో ఉండగా ఆమె పరిస్థితిని చూసి న్యాయం చేయాలని కాశీబుగ్గ పోలీసులకు తల్లి ఆశ్రయించింది. శనివారం సాయంత్రం బర్త్‌డే పార్టీ పేరుతో ఇద్దరు బాలికలపై ఇద్దరు బాలురు అత్యాచారం చేయడం, మరో బాలిక అంగీకరించకుండా బయటకు వెళ్లిపోయినట్లు సమాచారం. అయితే ఇద్దరు బాలురు చేసిన అత్యాచారాన్ని మరో బాలుడు వీడియో తీయడం వంటి అంశాలపై పోలీసుల ఎదుట వీడియో తీసిన బాలుడు అంగీకరించినట్లు సమాచారం. అంతకు ముందు ఈ వ్యవహారంలో బేరసారాలు జరగ్గా ఈ విషయం పోలీసులకు తెలియడం తో సదరు పెద్ద మనుషులు తప్పుకున్నట్లు తెలిసింది. ఆదివారం విషయం పత్రికల్లో రావడంతో వ్యవహారం మొత్తం వెలుగుచూసింది. ఇందులో ఓ బాలిక ఆ ఘటన నుంచి ఇంకా తేరుకోక పోవడంతో ఆమె తల్లి తన కుమార్తెకు న్యాయం చేయాలని ఆదివారం మధ్యాహ్నం పోలీసుల కు ఫిర్యాదు చేసింది. సీఐ డి.మోహనరావు ముగ్గురు బాలురపై పోక్సోతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులకు కఠిన శిక్ష పడాలి: ఎమ్మెల్యే శిరీష

ఈ ఘటనపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని సీఐని కోరారు. గంజాయికి బానిస కావడం వల్లే మైనర్ బాలురు ఈ ఘటనకు పాల్పడ్డారని ఆమె వైసీపీ ప్రభుత్వ తీరుపై విమర్శించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లితో శిరీష మాట్లాడి వివరాల తెలుసుకున్నారు. అనంతరం సీఐతో చర్చించారు. ఈ ఘటనపై ఆమె విచారం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో ఇటువంటి ఘటనల్లో యువతులు మృతిచెందగా సెటిల్‌మెంట్లు చేసి కేసులు లేకుండా చేశారని, అటువంటి విధానాలకు తావు లేకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నేతలు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, డొక్కరి శంకర్ , జోగ మల్లి, గోళ్ల చంద్రరావు, కొరికాన శంకర్ తదితరు లున్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

బర్త్‌డే పార్టీకి పిలిచి ముగ్గురు మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. తమ బిడ్డల భవిష్యత్‌ను, పరువును దృష్టిలో పెట్టుకుని బాధిత కుటుంబాలు ఫిర్యాదు ఇచ్చేందుకు ముందుకు రాలేక పోతున్నాయన్నారు.

బాధాకరం: మాజీ మంత్రి అప్పలరాజు

ఇద్దరు బాలికలపై అఘాయత్నం బాధాకరమని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలపై రాష్ట్రంలో అనేక అఘాయత్యాలు జరుగు తున్నాయని, నేడు పలాసలో జరగడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

నందిగాం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో టి.రాజారావు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రక్షిత నీటి పథకాలను నీటి నిల్వలతో ఉంచాలని, వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ఏవైనా సమస్యలుం టే కంట్రోల్‌రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

విశ్వశాంతికి పాటుపడాలి

మెళియాపుట్టి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఓంశాంతి గురు మంజునాథ్ అన్నారు. సోమవారం చాపరలో ఓం శాంతి భవనంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితాన్ని ప్రతి ఒక్కరు ఎవరికి వారే చక్కదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓం శాంతి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి బుధవారం గ్రీవెన్‌సెల్

పలాస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి బుధవారం హౌసింగ్ సమస్యలపై గ్రీవెన్‌సెల్ నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎస్. రామారావు తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శిరీష ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వ లేఅవుట్లలో లబ్ధిదారులు గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, బిల్లుల సమస్యలుంటే తక్షణం తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆకట్టుకున్న ఆలితిప్పలు నాటిక

టెక్కలి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో జరిగిన కార్యక్రమంలో టెక్కలి ప్రజాచైతన్య కళాసమితి ఆధ్వర్యం లో ప్రదర్శిం చిన ఆలి తిప్పలు నాటిక ఆకట్టుకుంది. ఈ నాటిక ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైనట్లు కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు యు.గణపతిరావు, చిలుకు కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా వేదిక ప్రతినిధులు సత్కరించి అభినందించినట్లు పేర్కొన్నారు.

'దుర్దశ'కు ఉత్తమ బహుమతి

పలాసరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'దుర్దశ' ఒడియా నాటికకు ఉత్తమ బహుమతి వచ్చినట్లు టీవీ, సినీనటుడు కుమార్‌నాయక్ తెలిపారు. తిరుపతిసాహు రచన దర్శకత్వం వహించిన ఈ నాటిక కళాకారులను వేదిక ప్రతినిధులు సత్కరించారు.

సాహితీ సదస్సులో రాణాప్రతాప్

హిరమండలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గూడెంలో జరిగిన ప్రపంచ తెలుగు సాహిత్య కళాజాతలో రుగడ గ్రామానికి చెందిన ఐ.రాణాప్రతాప్ బోధన భాషగా తెలుగు అనే అంశంపై పేపర్ ప్రజెంటేషన్ చేశారు. రాణాప్రతాప్‌ను వేదిక ప్రతినిధులు ప్రతాప్‌ను అభినందించారు.

పార్టీ సభ్యత్వంతో భరోసా: ఎంజీఆర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో ప్రతి కుటుంబానికి భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నంలోని తన క్యాంపు కార్యాల యంలో సోమవారం పార్టీ సభ్యత్వంపై పార్టీ నేతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ నిర్దేశించిన విధంగా పార్టీ సభ్యత్వాలను చేపట్టా లన్నారు. సభ్యత్వం కోసం రూ.100 చెల్లిస్తే రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయం కలుగుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి పార్టీ లక్ష్యాలను అధిగమించాలని కోరారు. పాతపట్నం, మెళియా పుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొ న్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే పార్టీ సభ్యత్వంపై నిర్వహించిన సమావేశానికి పలువురు సీనియర్ నాయకులు హాజరు కాకపోవడంపై గుసగుసలు వినిపించాయి. అయితే తమకు పార్టీలో ఎటువంటి ప్రాధాన్యం లేకుండా కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు సీనియర్ల నుంచి వినిపిస్తోంది.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే బగ్గు


తోటాడ బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్య మని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం వనితమండలం, గొల్లలవలస, గాతల వలస, చెల్లాయివలస కమ్మరిపేట, జడూరు, గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్లు, గోకులాలను ఉపాధి నిధులతో చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు ప్రవీణ్‌కుమార్, నేతలు బగ్గు అర్చన, ఎంవీ నాయుడు, ఆర్కే .నాయుడు, సూరపునారాయణ దాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలకు చెక్ పెట్టండి: ఎమ్మెల్యే శిరీష

పలాస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో తాగునీటి సమస్యలకు చెక్ చెప్పాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, జలజీవన్ మిషన్, మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు వెళ్తున్న జలజీవన్ మిషన్ నీటిలో 8 టీఎంసీల నీరు పట్టణంలో వినియోగిస్తే పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్ రావు, డీఈఈ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతే ధ్యేయం

హరిపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):పల్లెల ప్రగతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. అల్లిమెరక, నారాయణ పురం, వీజీపురం గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. గ్లో సంస్థ ఆధ్వర్యంలో టీ గంగువాడలో సామాజిక భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, జీకే నాయుడు, బమ్మిడి కర్రయ్య, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, డీఈఈ జి.రవి కుమార్ పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ జాం



కొత్తూరు, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ హాస్టల్ వద్ద ప్రధాన రోడ్డుపై తరచూ ట్రాఫిక్ జాం అవుతోంది. ఈ మార్గంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనాలు వాటిలో దిగబడి పోతున్నాయి. తరచూ ఈ పరిస్థితి నెలకొంటుండడంతో ఇతర వాహనాలు వెళ్లలేక నిలిచిపోతున్నాయి. దీంతో గంటల తరబడి ప్రజలు ట్రాఫిక్‌లో ఇరుక్కోవాల్సి వస్తోంది. సోమ వారం కిలోమీటరు మేర వాహనాలు నిలిచి ట్రాఫిక్ నిలిచిపోయింది. గ్యాస్ సరఫరా వ్యాన్లు, బస్సులు, ఇసుక లారీలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నాయి.

గిరిజన ప్రాంతాల సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. గొట్టిపల్లి సచివాలయం పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో సమస్యలపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొట్టిపల్లి పంచాయతీకి రహదారి, శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టాలని, బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు నిమ్మక అప్పన్న, పాలక పార్వతి, గేదెల ధర్మారావు, ఆరిక శివ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి నాయుడికి శివాజీ పరామర్శ

పలాసరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కాళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ దువ్వాడ కృష్ణమూర్తి నాయుడును సోమవారం లక్ష్మీపురంలో మాజీ మంత్రి గౌతు శివాజీ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఇరువురు చర్చించారు. దువ్వాడ సంతోష్, దువ్వాడ హర్ష, మురళి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

రీ సర్వే తప్పులను సరిచేస్తాం

- తహసీల్దార్ సోమేశ్వరరావు



నందిగాం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఎదురైన భూ సమస్యల్లో తప్పులు సరిదిద్దేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావు తెలిపారు.

ప్రశ్న: ఎన్ని గ్రామాల్లో సర్వే జరిగింది?

జవాబు: మండలంలో 32 గ్రామాల్లో సర్వే జరిగింది. మంగళవారం నుంచి ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించనున్నాం.

ప్ర: ఎన్ని రోజుల పాటు గ్రామసభలు నిర్వహిస్తారు?

జ: సర్వే జరిగిన 38 గ్రామాల్లో రోజుకో గ్రామంలో సెలవులు మినహాయించి గ్రామ సభలు నిర్వహిస్తాం.

ప్ర: రెవెన్యూ పరంగా ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

జ: రైతులకు ఎదురయ్యే సమస్యల్ని గ్రామస్థాయిలో ఆయా రెవెన్యూ అధికారుల ద్వారా సమాచారం సేకరించి పరిష్కారానికి కృషి చేస్తా.

ప్ర: అల్పపీడన హెచ్చరికతో తీసుకుంటున్న చర్య లేమిటి?

జ: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం దృష్ట్యా వీఆర్వోలను అప్రమత్తం చేశాం. కోత దశలో ఉన్న వరి పంటను వారం రోజుల పాటు కోయకుండా రైతులకు అవగాహన కలిగించాలని సూచించాం.

న్యూస్ బాక్స్

నేటినుంచి ఆధార్ శిబిరాలు

నరసన్నపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు మొబైల్ ఆధార్ స్పెషల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదనరావు తెలిపారు. మంగళ, బుధ వారాల్లో జమ్ము, మాకివలస, కోమర్తి, చెన్నాపురం. 24, 25న గోపాలపెంట, ఉర్లాం, చోడవరం గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌ను ఫోన్ నెంబరుతో అనుసంధానం, ఈకేవైసీ తదితర సమస్యలను ఈ శిబిరంలో పరిష్కరించడం జరుగుతుందన్నారు.

గ్రామసభల్లో సమస్యలను పరిష్కరించాలి

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మంగళవారం నుంచి నిర్వహించనున్న రెవెన్యూ గ్రామసభల్లో రైతుల భూములకు సంబంధించిన సమస్య లను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మంగళవారం నుంచి నవంబరు 18వ తేదీ వరకు ఈ గ్రామ సభలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు.

నేటినుంచి గ్రామసభలు

హిరమండలం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే అయిన గ్రామాల్లో మంగళవారం నుంచి భూ సమస్యలపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హనుమంతు రావు తెలిపారు. నవంబరు 14 వరకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తామని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

జలుమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం నుంచి నవంబరు 22వ తేదీ వరకు నెలరోజుల పాటు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు జన్ని రామారావు తెలిపారు. రెవెన్యూ గ్రామాలు వారీగా ఈ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తామన్నారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు.

కంటి ఆపరేషన్‌కు 45 మంది ఎంపిక

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేటలో సోమవారం శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్య సహాయకులు ఎస్.అంజలి తెలిపారు. 110 మందికి కంటి పరీక్షలు చేసి 45 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశామన్నారు. క్యాంప్ ఇన్‌చార్జి టి.రామారావు, ఎం.షన్ముఖరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.